# చివరి పేజీ




కారణం ఏమైనా కావచ్చు. కూడనిది ఏదైనా రహస్యంగా చేయడమంటూ వస్తే, అందునా ప్రేమానురాగాలు ఉన్న వ్యక్తుల విషయంలో, నేరం చేశామన్న భావం నెలకొంటుంది. జీవితంలో మలుపులకు మూలమై కూర్చుంటుంది. జీవితాన్నే శాసిస్తుంది.

---

జి. సుగుణ

"ఎక్కడెక్కడి పావురాలో
ఇక్కడకు బిల్చెగిరి వచ్చి
వెండి గిన్నెలో జొన్నగింజలు
మెక్కి వెళ్ళినవీ—"

**అంటూ** బల్లమీద బెత్తంతో తాళంవేస్తూ పున్నయ్య పంతులుగారు మూడో తరగతిలో పాఠం చెప్పే దృశ్యం సీతన్నకు చాలాకాలం గుర్తుంది. ఒక గిన్నె, లోపల గింజలు, నాలుగు పావురాలు ఎగిరివస్తూ, నాలుగు దిగి తింటూ, నాలుగు తిని ఎగిరిపోతూ—ఇదీ తన తెలుగు వాచకంలో చిత్రకారుడు గీచిన బొమ్మ. క్రింద ఈ పాట. పున్నయ్య పంతులుగారికి ఈ పాఠం అంటే వల్లమాలిన ఇష్టం. కంఠతా పట్టమని పిల్లలందరికీ పదేపదే చెప్పాడు.

* * *

సీతారామయ్య కోరుకొన్నట్లుగా ఎర్రని పెండ్లామే దొరికింది. కట్నం దమ్మిడీ తాకలేదు. పిల్ల బాగుంటే చాలనుకున్నాడు పెండ్లికొడుకు తండ్రి రంగయ్య. ఆస్తంటూ చిల్లిగవ్వ లేక పోయినా సుబ్బయ్య రత్నంలాంటి కూతురిని మాత్రం కన్నాడు.

సీతారామయ్యకు తగినట్లు నల్లపిల్లేగాని ఎర్రపెళ్ళాం రాదంటూ హేళన చేసినవాళ్లంతా ఒక్కసారి నోరుమూసుకున్నారు. సీతారామయ్య కిప్పుడు నడివీధిలో అంబారీ ఎక్కినంత పనయింది.

* * *

కృష్ణాష్టమి ఆ ఊళ్ళో ఎప్పుడు జరిగినా అంత వైభవంగానూ ఉంటుంది. వీధుల్లో ఉట్లు కడతారు. పిల్లలు వసంతపు బళ్ళవెంట చెంబులు తీసుకొని పరుగెత్తుతూ ఉంటారు. నల్లని చిరుబొజ్జ ఊగులాడుతూ ఉంటే, సీతన్న ఎగిరెగిరి ఉట్టినందుకుంటూ ఉంటే నవనీతచోరుళ్ళా ఉండేవాడు. ఎగురెగురికీ సీతన్న కళ్లల్లో వసంతం జల్లుతూ ఉండేవారు అల్లరి పిల్లలు. ఉట్టి లంకించుకునే శక్తి నిజానికి సీతన్నకు లేకపోయినా కాస్సేపయ్యాక అందించి ఊరుకునే వారు, ఉట్లెవ్వరు లాగుతూ ఉన్నా.

* * *

తనభర్త తెల్లగా ఉండాలి. చేతికి వాచీ పెట్టు కోవాలి. తెల్లబట్టలు వేసుకోవాలి. సిగరెట్టు తాగుతూ ఉండాలి. తరుచుగా తన్ను వెంట బెట్టుకొని అక్కడికీ, ఇక్కడికీ వెళ్తుండాలి—ఇవీ లక్ష్మి ఊహించుకొన్న భర్త లక్షణాలు.

అంతా తల్లక్రిందులయింది. సీతారామయ్యలో లక్ష్మి కోరుకున్న గుణం ఒక్కటీ లేదు. కానీ, పుట్టింటి స్థితిగతులు తెలిసిన లక్ష్మి పెళ్లి చూపులకు వచ్చిన సీతారామయ్యను చేసుకోవడానికి అప్రయత్నంగా తల ఊపేసింది. అంతే. పెళ్లి జరిగిపోయింది.

గృహప్రవేశం జరిగింది.

"ఏమిటమ్మా, ఎడంకాలు ముందు పెట్టింది?" అంది ఓ పేరంటాలు.

"అదేలే అమ్మాయికి కుడికాలు" అంది మరో తల్లి.

తను చెప్పినట్లుగా చేయకపోయినా పురోహితుడు ఏమీ ఎరగనట్లుగా మిగతా తతంగం అంతా కానిచ్చేశాడు.

* * *

"ఏమండీ! మీరు చేతికో వాచీ కొనుక్కో గూడదూ?" లక్ష్మి యిల్లా అంటున్నందుకు సీతారామయ్యకు చాలా ఆశ్చర్యం వేసింది. ఎవరన్నా నగలూ, నెక్లెసులూ కావాలని భర్తలను వేధిస్తారు. లక్ష్మి తననే వాచ్ కొనుక్కోమంటున్నది. ఈ అభ్యర్థన లక్ష్మి ఎన్నిసార్లు చేసిందో! నిజానికి తెల్లని గొలుసుతో వాచీ ఉంటే తనచేతికెంత అందంగా ఉంటుంది! అమ్మచేత నాన్నకు చెప్పించాడు తనకో వాచ్ కావాలని. లక్ష్మి కోరుకున్నట్లు సీతారామయ్య చేతికి వాచ్ వచ్చేసింది.

సీతారామయ్య ఒంటిమీద ఇస్త్రీమడత కాస్త నలిగితే లక్ష్మి మళ్లీ కట్టుకోనిచ్చేది కాదు. మడత నలగని తెల్లని బట్టలు, చేతికి వాచీ—సీతారామయ్య ఎంత మారిపోయాడు!

సీతారామయ్యకు ఉద్యోగం అంటూ లేక పోయినా, తండ్రి ఇంకా సంపాదిస్తూనే ఉండడం చేత కాలం చల్లగా దొర్లిపోతున్నది.

• • •

ఆ రాత్రి రంగయ్యకు నిద్రపట్టలేదు. పక్క మీద అటూ ఇటూ దొర్లుతూ ఉన్నాడు. కప్పుకున్న దుప్పటీ పొగకంపు కొడుతున్నది. చాకివాడు చుట్టపీలుస్తూ ఎప్పుడో కప్పుకొని ఉంటాడు. దాన్నే పెట్టెరుద్ది పట్టుకువచ్చాడు. ఆ దుప్పటి నిజానికి రంగయ్యది కాదు. పడక గదిలో సీతారామయ్య కప్పుకునేది. కొడుకు దుప్పటి అల్లా తగలేసుకు వచ్చినందుకు రంగయ్యకు చాకివాడిమీద ఒళ్లుతెలియని కోపం వచ్చింది.

రంగయ్య కొడుకును పిల్చాడు. "ప్రతి గాడిద కొడుకు పొగతాగేవాడే. ఒరే, సీతీ! ఆ దుప్పటీ చూడు ఎల్లా తగలేసుకొచ్చాడో! అంత చుట్ట కంపూ! బీడీకంపూ!" అంటూ బయటుకువెళ్తున్న రంగయ్య ఇల్లాలినిపిల్చాడు. "చూడు...ఆదుప్పటి వాళ్లకేస్తావేమో!... కోడలుపిల్ల బెదిరిపోతుంది. అందులో ఆ అమ్మాయికన్నీ నీటుగా ఉండాలి" అని గొణుగుతూ వెళ్లిపోయాడు.

* * *

"లక్ష్మీ! నా జీవితాన్ని సంపూర్ణంగా మార్చేశావు" అన్నాడు సీతారామయ్య ఏకాంతంలో.

"మీరే మార్చుకున్నారు" అంది లక్ష్మి బుంగమూతి పెడుతూ.

"నువ్వే మార్చావు. కాదంటే నీకోసం నేనే మారాను."

నిజమే. సీతారామయ్య, లక్ష్మికోసం పూర్తిగా మారిపోయాడు. ఒక్కరంగులో తప్ప లక్ష్మి కోరుకున్న భర్తకూ, సీతారామయ్యకూ ఇప్పుడు [illegible] లేదు. అప్పు

మీ వ్యక్తిగత
క్రమశిక్షణ
కార్యానిరతి
కృతనిశ్చయం
దేశరక్షణకు
అవసరం

డప్పుడూ సినిమాలకూ, పార్కులకూ ఇద్దరూ కలిసి వెళ్తున్నారు.

సీతారామయ్య ఆట్టే చదువుకోకపోయినా ఏదో ఓ వంద రూపాయలపాటి ఉద్యోగం సంపాదించుకోవడానికి తగిన విద్యార్హతలు సమకూర్చుకున్నాడు.

ఎక్కడన్నా ఉద్యోగం లంకించుకోవాలి. ఇల్లు విడిచి వెళ్లిపోవాలి. వేరే కాపురం సాగించాలి. సీతారామయ్యకు ఈ కోర్కెలు రోజు రోజుకూ బలవత్తరమవుతున్నాయి. తానేదో అపరాధం చేస్తున్నాడు. తండ్రికి తెలిస్తే? ఇక తన మొగాన్ని తండ్రికి చూపించడం ఎలా? అంత దూరం రాకుండానే ఇల్లు విడిచి వెళ్లిపోవాలి. ఇదీ సీతారామయ్య నిశ్చయం.

దూరంగా పట్టణంలో చిన్న ఉద్యోగం దొరికింది. వెంటనే అనుకున్నట్లుగా కాపురం మార్చాడు. ఉద్యోగం తగినంతది కాకపోవడంతో, పైగా కొడుకు డబ్బుకోసం ఇంటికి ఉత్తరం ముక్కయినా వ్రాయకపోవడంతో రంగయ్యకేమీ పాలుపోవటంలేదు. ఆట్టే కాలం కొడుకును విడిచి ఎప్పుడూ ఉండలేదేమో, రంగయ్య కొంచెం బెంగ పెట్టుకున్నాడు. అసలు సీతారామయ్య ఉద్యోగం చెయ్యడం రంగయ్యకేమీ ఇష్టంలేదు. కానీ తప్పలేదు. వచ్చే కొద్దిపాటి జీతంతో కొడుకెల్లా కాపురం లాగుతున్నాడో అన్నదే రంగయ్య బెంగ.

• • •

అదే ఘడియు. రంగయ్య కొడుకుకు ఉత్తరం వ్రాస్తున్నాడు. "నాన్నా!" అంటూ ప్రారంభించాడు ఆప్యాయంగా. సీతారామయ్య తండ్రికి లేఖ వ్రాస్తూ "నాన్నా" అనే మొదలు పెట్టాడు. రెండుఉత్తరాలూ పోస్టయ్యాయి.

మరునాడు సీతారామయ్య ఆఫీసునుండి ఇంటికి కొంచెం పెందరాళే వచ్చాడు. వచ్చేసరికి లక్ష్మి ఒకటే ఏడుపు. కళ్లు ఎర్రబడ్డాయి. లక్ష్మికి నెల తప్పింది. అకస్మాత్తుగా ఏం ప్రమాదం జరిగిందో అనే అనేక ఊహలు సీతారామయ్య బుర్రలో గిర్రుమన్నాయి.

ఏడుస్తూనే లక్ష్మి, సీతారామయ్య చేతికి

ఒక తంతి, ఒక కార్డు ఇచ్చింది. రెండూ ఇంటి దగ్గరినుండే. తంతి విప్పాడు. "యువర్ ఫాదర్ ఎక్స్పైర్డ్—స్టార్ట్, ఇమీడియేట్లీ" అని ఉంది. కాళ్లు దడదడలాడాయి. పసిపిల్లాడులా బావురుమన్నాడు. కార్డు చదువుకున్నాడు.

"నాన్నా!

ఇక్కడ మేము దైవకృపవల్ల క్షేమం. మీరుగూడా కులాసాగా ఉంటున్నారనుకుంటాం. మీరు వెళ్లాక పైకంకోసం జాబు వ్రాయలేదు. నీకు వచ్చేది చాలా కొద్ది. కాపురం పట్నవాసంలో. ఎల్లా గడుపుతున్నావో అని బెంగగా ఉంది. ఈ ఉత్తరం అందిన వెంటనే నీకెంత డబ్బు కావలసినదీ వ్రాయవలెను. పంపిస్తాను.

గ్రహించవలెను,
మీ తండ్రి,
రంగయ్య వ్రాలు."

ఈ ఉత్తరం చదవడంతో సీతారామయ్యకు మరీ దుఃఖం వచ్చింది. వెంటనే ఇల్లు చేరుకోవాలి. అమ్మ, శవాన్ని ముందుపెట్టుకొని తన కోసం కాచుక్కూచుంటుంది. ఇల్లంతా ఎంత గందరగోళంగా ఉందో! టాక్సీ తీసుకున్నాడు. తిన్నగా వేంపల్లికే మాట్లాడుకున్నాడు. టాక్సీ రంయిమంటూ దవుడు తీసింది. ఇల్లు చేరుకున్నాడు. అర్ధరాత్రి ఒంటిగంటన్నరయింది. డ్రయివర్ ఫేర్‌బోర్డు చూచాడు. డెబ్బయి ఐదు రూపాయలన్నాడు. తన చేతిలో చిల్లిగవ్వ లేదు. అమ్మనడిగాడు.

"చూడు, నాయనా! నీకు పంపించాలంటూ ఎంతో ఆ మూల సొరుగులో పెట్టారు. తీసుకో" అంటూ ఇనప్పెట్టె చూపించింది. సొరుగు లాగాడు. పైకం పైకి తీశాడు. శవం తలవద్ద పెట్టిన ప్రమిద ఒక్కసారిగా పెద్ద వెలుగు వెలిగింది. మళ్లీ సన్నగానే. ఏడు పది రూపాయల నోట్లు, ఒక ఐదు రూపాయల నోటు ఉన్నాయి. తీసుకువెళ్లి డ్రయివరు చేతిలో పెట్టాడు. తాను వ్రాసిన ఉత్తరం అక్కడే పడి ఉంది. తీసి జాగ్రత్త చేశాడు.

తెల్లవారింది. అప్పటికే ఉబ్బి రూపం కొంచెం మారిపోయిన తండ్రి శవాన్ని కాటికి చేర్చారు. తలకొరివి తగిలించి నిల్చున్నాడు సీతారామయ్య. ఒక్కసారి తన ఉత్తరం మళ్లీ తీశాడు. చదువుకుంటున్నాడు.

"నాన్నా,

నమస్కారములు. మీ కృపవల్ల మేమిక్కడ కులాసాగానే ఉన్నాము. నా గురించి మీరేమీ దిగులు పెట్టుకోవద్దు. నిన్ననే నాకు మరో పెద్ద ఉద్యోగం వచ్చింది. ఇక పైకం విషయంలో ఇబ్బందేమీ లేదు. అమ్మకు నా నమస్కారములు.

చిత్తగింపవలెను,
మీ కుమారుడు,
సీతారామయ్య."

ఇది నాన్న పడిపోయాక, ఓ గంటకు తెచ్చి యిచ్చాడు పోస్టుమన్ — అని అమ్మే చెప్పింది. దాన్నిగూడా కాలుతున్న నాన్న శవంమీద పెట్టి తిరిగి వచ్చాడు.

*　　*　　*

లక్ష్మికి కడుపు పండినవేళ మంచిది కాదన్నారు. కడుపులో పిండం తాతకు గండం తెచ్చిందన్నారు. సీతారామయ్యమాత్రం తనకు ఉద్యోగం వచ్చినవేళ మంచిది కాదనుకున్నాడు.

ఇంటి వ్యవహారాలు చూచుకోవాలి. ఉద్యోగానికి 'చిత్తగించవలెను' వ్రాశాడు. ఇంటిపట్టునే ఉండి ఆస్తి విషయం చూచుకుంటున్నాడు.

సీతారామయ్యకు మనస్సేమీ బాగులేదు. సిగరెట్లమీద సిగరెట్లు తగలేస్తున్నాడు. ఎప్పుడో నాన్న కప్పుకున్న ఒక్క దుప్పటీయే పొగకంపు కొట్టింది. ఇప్పుడు తనది అనుకున్న ప్రతి వస్తువూ సిగరెట్టుకంపే. ఆనాడే తాను సిగరెట్లు తాగుతున్నట్లు నాన్నకు తెలియదు. చాకివాడిపని అని నాన్న మండిపడ్డాడు.

అదే నాన్నకు తెలియకుండా తానుచేసిన అపరాధం. అందుకే ఇల్లు విడిచి వెళ్లాలనే నిశ్చయం. సీతారామయ్య, లక్ష్మికోసం సిగరెట్లు ప్రారంభించాడు. ఇప్పుడు తనకోసమే తాగుతున్నాడు. ఏనా ఇది మహాపరాధం ఏం కాదు. సీతారామయ్య అంతచాటుగా చేయవలసిన పని గూడా కాదు. కాని అతని మనస్సెందుకో చాలా బాధపడింది. తండ్రికి తెలిస్తే కొంప మునుగుతుం దనుకున్నాడు. అందుకనే ఉద్యోగ ప్రయత్నం చేశాడు. అంతే. లక్ష్మిలేకపోయినా ఉంటాడు కాని ఇప్పుడు సిగరెట్లు లేకపోతే మాత్రం ఉండలేడు.

తండ్రి చావుకు తానే కారణం అనుకున్నాడు. దానితో మరీ దిగాలుపడి కూర్చుంటున్నాడు.

*　　*　　*

ఇంటి విషయం అట్టే పట్టించుకోడు. ఎప్పుడూ ఏదో ధోరణిలో ఉంటాడు. ఏదో వెళ్లాలని బయల్దేరుతాడు. ఎక్కడికిపోతాడో, ఎప్పుడు తిరిగివస్తాడో ఇంట్లోగూడా చెప్పడు. తనకే తెలియదేమో!

స్నేహితులిళ్లకు వెళ్తాడు. బంధువులిళ్ళకు వెళ్తాడు. కొంతకాలం ఉంటాడు. మొదట్లో మొదట్లో చెప్పి తిరిగి బయల్దేరేవాడు. ఇప్పుడది గూడాలేదు. అతని విషయం అతనికీ తెలికుండా అయిపోయింది. రంగయ్యమీద ఉండే గౌరవంతో సీతారామయ్య నెవరైనా చేరదీస్తారు. మిత్రులు తిరగవద్దన్నారు. బంధువులు హితోపదేశం చేశారు. సరే అనేవాడు. ఇంటికనే బయలుదేరుతాడు. మళ్లీ మనస్సెటు లాక్కుపోతే అటే.

ఇస్త్రీబట్టలు మురికి గుడ్డలయ్యాయి. నున్నని గడ్డం గరుకుబారింది. తనచేతి వాచీ ఎవడిచేతిమీది కెళ్లిందో.... లక్ష్మికి గుండెలు పగిలిపోయాయి. కన్నకొడుకు చదువూ సంధ్యా ఎవరు చూస్తారు? కొద్ది వయసులోనే వాడూ సంపాదనకు దిగాడు. లేకపోతే భుక్తి....?

## గమనిక


మామూలుగా ప్రచురణకుకాని, పోటీలకు కాని కథలు, నవలలు ఎవరికి పంపాలో తెలియపరచమని కోరుతూ కొందరు వ్రాస్తున్నారు. 'ఎడిటర్, ఆంధ్ర ప్రభ సచిత్ర వారపత్రిక, చిత్తూరు'కు పంపాలి.


రేఖాచిత్రాలు, డిజైనులు ఇండియన్ ఇంక్‌తో వేసినవి మాత్రమే ప్రచురణకు పరిశీలించడం జరుగుతుంది. మామూలు సిరాతోకాని, పెన్సిల్‌తో కాని వేసినవి అంగీకరించబడవు. ఇండియన్ ఇంక్‌తో వేసినవి కవరులో మడిచి పంపవచ్చు.

—ఎడిటర్

అప్పు తీసుకోండి
250 నుంచి 10 వేల రూపాయల వరకు
వివాహం, వ్యాపారం, ఇల్లు, కారు, స్కూటర్ మున్నగు వాటి కొరకు; స్వంత జామీనుపై; సులభమైన నెలసరి వాయిదాలపై తిరిగి చెల్లించేపద్ధతిని. ఉచితంగా పంపే ప్రాస్పెక్టస్ కొరకు నేడే ఇంగ్లీషులో కాని, హిందీలో కాని వ్రాయండి.
KUBER FINANCE (P) LTD.,
(K—54) AMRITSAR-5.

మాలతీ చందూర్ గారి
వంటలు, పిండివంటలు
1 వ భాగం రు. 3-00
2 వ భాగం రు. 2-00
అందాలు, అలంకారాలు రు. 2-50
బుజ్జాయిగారి కొత్తబొమ్మలపుస్తకాలు
నవ్వులబండి
(డుంబు కొత్తబొమ్మలు) రు. 0-75
పాతబంగళా
(బొమ్మల డిటెక్టివ్ కథ) రు. 0-75
డుంబు (బొమ్మలతో) రు. 0-75
పిల్లలు పువ్వులు
(రంగుల బొమ్మలతో) రు. 1 25
కమలా పబ్లికేషన్స్, చోడవరపు దేవరాజుగారి స్ట్రీట్, (ఆరండల్ సత్రానికి ఎదురుగా) విజయవాడ—2.




కన్‌జన్‌గూడు ఔషధములకు ఒక టవునుకు ఒక స్టాకిస్టును ఆహ్వానించెదము




PRABHAT
KAKINADA

## ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక చందాదారులకు విజ్ఞప్తి!

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక కొరకు చందా పంపేవారు ఈ దిగువ పేర్కొన్న అంశాలు పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నాము:

1. చందా పంపేటప్పుడు మని ఆర్డర్ కూపనులో కాని, ఉత్తరంలో కాని తమకు ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక పంపాలని స్పష్టంగా వ్రాయాలి.

2. పాత చందాదారులు తమ చందా సంఖ్య ఉదాహరించాలి.

3. ఎంతకాలం పంపవలసినది స్పష్టంగా వ్రాయాలి.

4. గ్రామం పేరు, పోస్ట్ ఆఫీసు, ఏ ఊరుమీదుగా పంపవలసినది (అవసరమైన సందర్భాలలో), తాలూకా, జిల్లా మున్నగు వివరాలు అన్నీ స్పష్టంగా వ్రాయాలి.

5. చందా మొత్తం 'మేనేజర్, ఆంధ్రప్రభ లిమిటెడ్, విసెంటురోడ్డు, గాంధీనగర్, విజయవాడ 3' చిరునామాకు పంపాలి.

సాలుచందారు.15-60న.పై
6 నెలలకు రు. 7-80 న.పై.
3 నెలలకు రు. 3-90 న.పై.

సదా చందాదారుల సహకారం అర్థిస్తున్నాము.

మేనేజరు.

## నారసింహ లేహ్యం

శ్రేష్ఠమయినది — మేహము, నిక్కాక నిస్సత్తువను హరించి వీర్యవృద్ధిని, బలము రక్తవృద్ధి కలిగించును. 20 తు. రు. 3—50

## రోజాపుష్ప లేహ్యము

అజీర్ణం, గర్భవాతం, మలబద్ధకం హరించి చక్కగా విరేచనమును, జీర్ణశక్తిని కలిగించును. 15 తు. రు. 1—25, పోస్టేజి ప్రత్యేకం. క్యాటలాగు ఉచితం. పి. సి. ఏ. అండ్ కో., ఆయుర్వేద సమాజం, పెరిదేపి, నెల్లూరు జిల్లా.

ఇంటిముందే బట్టల దుకాణం. దానిముందో బట్టల మిషన్. అక్కడే పనిచేస్తూ ఉంటాడు సీతారామయ్య కొడుకు రంగ. కాజాలు తీస్తాడు. గుండీలు కుడతాడు. బనీన్లుగూడ ఇప్పుడే కుడుతున్నాడు. చిన్న చిన్న అందీఅందని లేత పాదాలతో ఆ చిన్నిరంగ మిషన్ తొక్కుతూ ఉంటే ఊరంతా జాలిగా చూస్తుంది. పని చురుగ్గా చేస్తాడు రంగడని ఊరంతా చెప్పుకుంటూంటే లక్ష్మికి ఘనీభవించిన దుఃఖంలోనూ ఎక్కడో ఒక చిన్న ఆనందరేఖ గోచరిస్తూ ఉంటుంది. తను కాలు పెట్టాక వచ్చిన సంసారం వల్ల కాదుగా తయారయిందనే లక్ష్మి అంతరాంతరాల్లో మథనపడుతూ ఉంటుంది.

* * *

సీతారామయ్య ఊరువిడిచి పెట్టి అప్పుడే ఏడాదయింది. అక్కడ కనిపించాడనీ, ఇక్కడ కనిపించాడనీ, అలా ఉన్నాడనీ, ఇలా ఉన్నాడనీ లక్ష్మి చెవుల్లో పడుతూనే ఉంది. గుండె పగిలిన లక్ష్మికి హృదయం నిండా నెత్తురు చారలేగాని ఓదార్పులూ, బుజ్జగింపులూ కాపురం చేయలేవుగా!

సీతారామయ్య తల్లిమొహం చాటంత అయింది. ఎవరో చెప్పారు. శ్మశానంలో ఉన్న జమ్మిచెట్టుకింద ఎవరో కూర్చుని ఉన్నాడనీ, అచ్చు సీతారామయ్యలాగే ఉన్నాడనీను. తల్లి పరుగు పరుగున వెళ్లింది. ఊరంతా ఆమెకూ పిచ్చి పట్టిందనుకున్నారు. ఇంతాచేసి శ్రమ విఫలం. అక్కడ ఎవ్వరూ లేరు.

చీకటి పడింది. ఒక కుంటితాతఅడుక్కుంటూ గుమ్మం గుమ్మానికీ తిరుగుతున్నాడు. పక్కనే మరో బిచ్చగాడు. పలకడు, ఉలకడు. తనకు తెలిసిందల్లా ఒక్కటే. మరీ ఆకలేస్తే ఏ గడప ముందో నిల్చుని 'అమ్మా!' అని పట్టెడన్నం పెట్టమన్నట్టు చేయి చూపిస్తాడు. ఈ రెండో వ్యక్తి సీతారామయ్యేనని ఎవరైనా గ్రహించవచ్చు.

తా నెక్కడుంటే అక్కడకు వెళ్లి లక్ష్మిఏవేవో మాట్లాడేది. ఇంటికి రమ్మని బతిమాలేది. అతగాడు మాత్రం రాడు. లక్ష్మిని గుర్తుపట్టినట్టే ఉంటాడు. మళ్లీ మామూలు వ్యక్తిలా పలకరిస్తాడు. కడివెడు కన్నీళ్లతో లక్ష్మి అల్లాగే నిల్చిపోయేది.

అడుక్కోవటానికి కుంటితాతతో బయల్దేరుతాడు. అంకింది తింటాడు. పెట్టని అమ్మను చూచి తిట్టడు. సీతన్న చాలా మంచివాడు. ఎవరు అన్నా ఇదే మాట. కృష్ణాష్టమినాడు చూడాలి సీతన్న సంబరం. ఆ ఉట్టికొట్టం ఎగిరే సీతన్న ఆ పండుగకే పేరు మార్చాడు. 'సీతన్న పండగ' అంటే పొరుగూరి వారికి గూడా తెలిసిపోయింది కృష్ణాష్టమేనని.


• • •

కాలచక్రపుటిరుసు విసురుల్లో బక్కచేవులు చితికిపోవాలి. ఇరుసు ఒరుసుకుంది కాబోలు సీతన్న కాళ్లకూ, చేతులకూ పుళ్ళుబడ్డాయి. సోగ మాసిన గడ్డం. రోజురోజుకూ సీతన్న సీతలా అయిపోతున్నాడు. అతని చేతికి అకాలంగా ప్రాప్తించవలసి వచ్చినందుకో ఏమో, ఊతకర్ర కొంచెం తలవంచుకుని నడుస్తున్నది. సీతారామయ్యకేసి మొహం తిప్పదు.

* * *

సీతన్నకు ఆమూటంటే పంచప్రాణాలు. విప్పి ఎవ్వరికీ చూపించడు. చాలా జాగ్రత్తగా దాచుకుంటాడు. ఆరోగ్యం రోజురోజుకూ అధ్వాన్నం అవుతున్నది. ఉండి ఉండి కడుపులో నొప్పి, పోట్లూను.

మరో కొంతకాలం తిరిగింది. కాలంతోపాటు సీతన్నా తిరుగుతున్నాడు ఊరూరా. కుంటి తాతకు చెప్పకుండా సీతన్న బయల్దేరాడు. మసక మసకగా ఉంది. ఇంకా కొన్నిక్షణాల్లో వెలుతురువస్తుంది. ప్రక్కనే పడుకుని రాత్రంతా



'డూ డూ డూ డూ బసవన్నా!' చిత్రం—దావరి నాగవర్ధనరావు (గుంటూరు 1)

ఏదో బాధతో మూలుగుతూ ఉన్న సీతన్నలేచి నడక సాగించాడు. కుంటి తాతకు మెలకువ వచ్చేసరికి సీతన్న చేతికర్రపోట్లు క్రమక్రమంగా హీనస్వరంతో వినవస్తున్నాయి.

వెంటబడ్డాడు కుంటితాత.

"సీతన్నా! ఎక్కడికీ.....?"

"............"

"సీతన్నా! సన్నే... ఆగు!... ఎక్కడికి వెళ్తున్నావ్?"

"........."

కుంటుకుంటూనే తాత వెంటబడ్డాడు. సీతన్న ఊతకర్ర క్రిందపడిన చప్పుడయింది. క్రిందబడింది కట్టే కావడంచేత మళ్లీ కదల్లేదు.

తాత, గాబరాగా దగ్గరకు పరుగెత్తుకు వచ్చాడు. సీతన్న ముఖం ప్రశాంతంగా ఉంది. సీతన్న ఆకారం మాత్రం కుంటితాత కళ్లల్లో. సీతన్న ఎక్కడికో వెళ్లిపోతాడని వెంటబడ్డాడు.

అకస్మాత్తుగా..... అదృశ్యంగా..... ఎక్కడకు లేచిపోయాడో తనకెల్లా తెలుస్తుంది?

క్రిందపడిన పాత చిరుగుల మూట పగిలిపోయింది. అసలే చినుగుల బొంత. దానికి జాగ్రత్తగా రంగడు మాసికవేసి కుట్టిపెట్టాడు. ఈ విషయం సీతన్న తాతతో ఎన్నిసార్లు చెప్పాడో! అందులోనుంచి ఓ చిన్న పుస్తకం బయటపడింది. తాత ఆ పుస్తకం తీసుకున్నాడు. అటూ ఇటూ తిరగేస్తున్నాడు. చివరిపేజీలో.....

"నాది వేంపల్లె. మా ఊరికి ఉత్తరపు పొలిమేరలో ఓ జమ్మి చెట్టు ఉంది. దానికి సరిగ్గా పడమరగా ఒంటరిగా నిలబడి ఓ నల్లరాతి బండ ఉంటుంది. అక్కడే నేను తలకొరివి ఊదిరాజేసింది. నాకు బాగా గుర్తుంది ఇది ఒక్కటే. దానికి ఉత్తరంగా ఆరడుగుల మేరలో ఉంటుంది మాతండ్రి పవిత్ర పాదాలు పెట్టిన పుణ్యప్రదేశం. అక్కడే..... సరిగ్గా అక్కడే.... జరగాలి నాకపాలమోక్షం. ఇదే నాకున్న ఒకేఒక కడసారి..."

తాత, సీతన్న దేహంకేసి చూశాడు. ఈ రహస్యం అప్పుడే ఎవరు బయటపెట్టారో ఓ ఈగముక్కుమీద వాలింది.... ఓ చీమ కనుకొలకులలోకి దిగుతూంది.

తాతకు తల తిరిగింది. కుంటు కుంటూ వల్లెవేపు ప్రయాణమయ్యాడు.

సూర్యోదయం అవుతున్నది. ఓ పొరుగూరి బిచ్చగాడు తంబురా మీటుకుంటూ అప్పుడే బిచ్చానికి బయల్దేరాడు. పాటపాడుతూ తిరుగుతున్నాడు......

"ఎక్కడెక్కడి పావురాలో
ఇక్కడకు చిక్కిగిరి వచ్చి
వెండిగిన్నెలా జొన్నగింజలు
మెక్కి వెళ్లినవి......"

★